క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దేవర

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని అటికెల గుండు గ్రామంలో కొలువైన గ్రామ దేవతలు సుంకులమ్మ, మారెమ్మ దేవర మహోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవార్లకు బోనాలు, నైవేద్యం సమర్పించారు.

ఎమ్మిగనూరురూరల్: ఎర్రకోట గ్రామంలో బుధవారం సుంకులమ్మ, మారెమ్మ అవ్వ దేవర మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలో ప్రజలు దేవాలయం వరకు కుంభాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

పత్తికొండ రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న కేసులో పరారీలో ఉన్న నిందితులు పెండేకల్ గ్రామానికి చెందిన శివ, ఎద్దులదొడ్డి షరీఫ్‌లను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. పత్తికొండ-చక్రాళ్ల రోడ్డులోని పంప్‌హౌస్ వద్ద రెండు రోజుల క్రితం పట్టుబడిన అక్రమ మద్యం కేసులో నిందితులిద్దరిని ఏఎస్ఐ జమీర్, సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. అలాగే మట్కా కేసులో పరారీలో ఉన్న జోగి ఉరుకుందును అరెస్టు చేసినట్లు తెలిపారు.

18న ఉత్సవాలు

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లె గ్రామ హైవే పక్కన వెలసిన అన్నపూర్ణ సమేత భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 18 నుంచి శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త లక్ష్మిరెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమాలతో ప్రారంభమై సాయంత్రం నందికోల సేవతో స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రి 1 గంటకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం ఉంటుందన్నారు.

పులకించిన ఆలంకొండ



అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న దృశ్యం

కృష్ణగిరి: భక్తుల ఆరాధ్య దైవాలైన ఆలంకొండ పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్ల దేవరను బుధవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవార్లకు ప్రతి ఇంటి నుంచి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. దేవరకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో గ్రామం కిటకిటలాడింది.

గురజాలలో ఏర్పాట్ల పరిశీలన

నందవరం: శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్ఐ మహేష్‌కుమార్ పర్యవేక్షించారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ నరసింహులు, సర్పంచ్ వీరస్వామితో ఏర్పాట్లపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం దర్శన క్యూలైన్లు, నదీతీరంలో పుణ్యస్నానాల ఏర్పాట్లు, డ్రస్సింగ్ రూములు, వాహనాల పార్కింగ్, క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సీసీ కెమెరాలు, బారికేడ్లు, ఏర్పాట్లను పరిశీలించారు.

అడిగిన వారందరికీ పనులు

తుగ్గలి: జాబ్ కార్డు కలిగి ఉండి పని కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంఎస్ఆర్ ఈజీఎస్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీలకు పని కల్పించేందుకు ముందస్తుగా పనులు గుర్తించి అనుమతులు పొంది సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కూలీల సంఖ్యను పెంచడంతో పాటు, పనులు నాణ్యతతో చేయించాలన్నారు. ఆన్‌లైన్ హాజరు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈసీ ప్రదీప్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని బింగిదొడ్డి మజారా కాశాపురం గ్రామంలో ఆంజనేయస్వామి ధ్వజ స్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. బుధవారం హోమాలు, తీర్థప్రసాదాలు కొనసాగాయి. రాత్రి పెద్దకొలుములపల్లె గోపాల్‌చే నిర్వహించిన భక్తిరస గీతాల రేలారే రేలా కార్యక్రమం అలరించింది. గురువారం ప్రతిష్ఠ ఉంటుందని, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొననున్నట్లు బింగిదొడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై కసరత్తు

ఆలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వెలువడడంతో గ్రామ పంచాయతీలో అన్ని రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను బుధవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. అలాగే వాల్‌పోస్టర్లు, పెయింటింగ్ తొలగిస్తున్నామని ఈఓ కృష్ణకుమార్ తెలిపారు. శానిటేషన్ సిబ్బంది రెండు రోజులుగా తొలగింపు పనిలో నిమగ్నమయ్యారు. ఆలూరు నియోజకవర్గానికి ఎన్నికల ఆర్ఓగా గాయత్రి దేవిని ఎన్నికల కమిషన్ నియమించింది. ఓటరు జాబితా, పోలింగ్ నిర్వహణ, సిబ్బంది నియామకం తదితర వాటిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి త్వరలో ఆమె ఆలూరులో పర్యటించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

హజరత్ అల్లిసాహెబ్ ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కై రవాడి గ్రామంలో బుధవారం హజరత్ అల్లిసాహెబ్ స్వాముల ఉరుసు అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామున స్వామి వారి గుర్రాన్ని పెద్ద దర్గా నుంచి అల్లిసాహెబ్ స్వామి దర్గా వరకు ఊరేగింపు చేశారు. భక్తులు అడుగడుగున స్వామి వారి గుర్రానికి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సర్వం శివోహం



తుంగభద్ర తీరంలో గురజాల రామలింగేశ్వరుడి ఆలయం,(ఇన్‌సెట్) శ్రీరాముడు ప్రతిష్ఠించిన ఇసుక లింగం

ఎమ్మిగనూరు/నందవరం: ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం మండలం గురుజాల గ్రామంలో తుంగభద్ర నది తీరాన వెలసిన రామలింగేశ్వరుని క్షేత్రం భక్తుల పాలిట కల్పవల్లిగా భాసిల్లుతోంది. ఇక్కడి శివలింగాన్ని శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించడంతో రామలింగేశ్వర స్వామిగా పేర్కొంటున్నారు.

దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వరుడి దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. ఆలయంలో ప్రతిష్ఠించిన పంచ శివలింగాలు దక్షిణాది క్షేత్రాల్లో అరుదు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేస్తూ ప్రతిష్ఠించిన సైకత లింగం, ఆంజనేయ స్వామి ప్రతిష్ఠించిన కాశీ లింగం, ధర్మరాజు ప్రతిష్ఠించిన లింగం ధర్మలింగం. భీమసేనుడు ప్రతిష్ఠించిన భీమలింగం, అర్జునుడు ప్రతిష్ఠించిన పార్థివ లింగం ఇక్కడ దర్శనమివ్వడం భక్తుల మహాభాగ్యం.

ఉత్సవ విశేషాలు

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 18న యాగమంటప ప్రవేశం, గణపతిపూజ, కలశస్థాపన, ధ్వజారోహణ, శతరుద్రాభిషేకం క్షీరాభిషేకం, సాయంత్రం ప్రభోత్సవం ఉంటుంది. రాత్రి 2 గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం జరుపుతారు. 19న ఏకాదశి మహా రుద్రాభిషేకం, సాయంత్రం 5 గంటలకు మహారథోత్సవం నిర్వహిస్తారు. 20న పారువేట, అభిషేకం, 21న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి నిర్వహించి, ఆదిదంపతులకు అభిషేకాలతోపాటు వసంతోత్సవం, వేద పండితులకు సమారాధన జరుపుతారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 18న జాగరణ సందర్భంగా భక్తులకు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నటరాజ కళాక్షేత్రం వారితో కూచిపూడి, భరతనాట్యం. రాత్రి 9 గంటలకు నందికోల సేవ నిర్వహించనున్నారు. 21న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తారు.

మహిమాన్వితం 'బుగ్గ సంగమేశ్వరం'





బుగ్గ సంగమేశ్వరం దేవాలయం, (ఇన్‌సెట్) స్వామి వారి మూలవిరాట్

మద్దికెర: మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో అనంతపురం జిల్లాలో ప్రకృతి ఒడిలో కొలువైన బుగ్గ సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులకు ఆహ్లాదం, ప్రశాంతత పంచుతోంది. శ్రీకృష్ణదేవరాయలచే నిర్మితమైన ప్రాచీన శివక్షేత్రంలో ఏటా మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు విశేష పూజలు జరుగుతాయి. ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 18న తెల్లవారు జామున 4 గంటల నుంచి పంచామృతాభిషేకం, కలశస్థాపన, నవగ్రహపూజ, 10 గంటల నుంచి 3 గంటల వరకు అన్నదానం, సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులకు గుగ్గిళ్ల ప్రసాదం వినిమయం. రాత్రి 12 గంటలకు పార్వతీదేవీ, శ్రీబుగ్గ సంగమేశ్వరస్వాముల వారి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 19న ఉదయం శ్రీవారికి అభిషేకం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు శ్రీవారి రథోత్సవం జరుగుతుంది. 20న ఉదయం 6 గంటలకు శ్రీవారి వసంతోత్సవం కార్యక్రమాలు ఉంటాయి.

ఆలయ చరిత్ర: పూర్వం ఒక ఋషి తన గురువు ఆజ్ఞ మేరకు ద్వాదశ జ్యోతిర్లింగాల యాత్రనారంభించి బుగ్గ సంగమేశ్వరానికి వచ్చారు. ఇక్కడ కాశీ క్షేత్రంలాగా ప్రవహిస్తున్న ఉత్తర వాహిని గంగా నదిలో స్నానమాచరించి బయటికి రాగానే ఒక తేజోవంతమైన శివలింగం కనిపించింది. భక్తి పారవశ్యంతో శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. బుగ్గలో ఉద్భవ లింగానికి ఆలయం నిర్మించి రావి, జివ్వి చెట్టు నాటారు. ఎదురుగా బసవన్న గుడిని నిర్మించారు. ఇక్కడ నిరంతరం రెండు నీటి బుగ్గలు కలిసి ఉత్తరం నుంచి దక్షిణం వైపు ప్రవహించడం వల్ల బుగ్గ సంగమేశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

అబ్బురపరుస్తున్న రామప్ప ఆలయం



చుంచుఎర్రగుడిలోని పురాతన రామప్ప దేవాలయం,(ఇన్‌సెట్) రామలింగేశ్వర స్వామి

కృష్ణగిరి: అబ్బుర పరిచే శిలా సంపదకు పుట్టినిల్లు చుంచుఎర్రగుడి రామప్ప దేవాలయం. శిథిలావస్థలో కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదంలో ఉన్న ఈ ఆలయాన్ని వైఎస్సార్‌సీపీ పాలనలో జీవనోద్ధరణకు పూనుకున్నారు. ఆనాటి కళాకారుల చేతి నుంచి జాలువారిన కళా శిల్పాలు అందిరినీ అకట్టుకుంటున్నాయి.

శ్రీకృష్ణ దేవరాయుల కాలంలో నిర్మాణం

శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయం చుట్టూ రాయిని చుంచుగా తయారు చేయడంతో ఈ గ్రామానికి చుంచుఎర్రగుడి అని పేరు వచ్చింది. రాయిని చుంచుగా మలచడం, స్తంభాలు సరిగమల రాగాలతో పలికేలా మలచడం ఇక్కడి విశిష్టత.

ఉత్సవాలకు ఏర్పాట్లు

18న స్వామికి అభిషేక కార్యక్రమాలు అలాగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు, రాత్రి భజన పోటీలు నిర్వహించనున్నారు. 19న తెల్లవారుజామున 4 గంటల నుంచి 7 గంటల మధ్య స్వామి వారి కల్యాణం, అనంతరం చెక్కభజన కార్యక్రమం ఉంటుంది. అలాగే పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు, రాత్రి ఆర్కెస్ట్రా ప్రోగాం నిర్వహించనున్నారు.

భక్తులను కటాక్షించే మండగిరి రామలింగేశ్వర స్వామి



రాజుల మండగిరి క్షేత్రం,(ఇన్‌సెట్) జనమేజయ మహారాజు చేత ప్రతిష్ఠించబడిన శివలింగం

పత్తికొండ రూరల్: రాజుల మండగిరి ఆలయంలో పురాతన శ్రీరామలింగేశ్వరాలయం మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. జనమేజయ మహారాజు సర్పయాగంలో భాగంగా రామలింగేశ్వరాలయం పడమర ముఖంగా ప్రతిష్ఠించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. మహిమాన్విత ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు సోమశేఖర్ తెలిపారు.

బ్రహ్మసూత్ర శివలింగ దర్శనం.. వెయ్యి రెట్ల దర్శన భాగ్యం: పత్తికొండలోని రెడ్డిబావి వీధిలో పురాతన శివాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఇటీవలే ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ ఆలయంలో శివలింగంపై ఉన్న బ్రహ్మసూత్రం ఇక్కడి ప్రత్యేకత. ఇలాంటి విశిష్టమైన ఆలయంలో స్వామిని దర్శించుకుని ద్రవ్యాన్నిగానీ, బలాన్నిగానీ, పాటనుగానీ, పద్యంగానీ, పల్లకీ సేవగానీ ఏదో ఒకటి ఆచరిస్తూ స్వామివారిని ధ్యానిస్తే వెయ్యి రెట్ల పుణ్యఫలం లభిస్తుంది.

బ్రహ్మగుండేశ్వరుని దర్శనం సర్వపాపహరణం

వెల్దుర్తి: కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రానికి తూర్పున 4.కి.మీల దూరంలో గల ప్రముఖ శైవ క్షేత్రం బ్రహ్మగుండం. మహిమాన్వితుడు కామేశ్వరీదేవి సమేత బ్రహ్మేశ్వరస్వామి కొలువైన ప్రసిద్ధ ఆలయం. పాపహారిణిగా, సర్వదోష నివారిణిగా పేరుగాంచిన భక్తిరసాన్విత క్షేత్రం బ్రహ్మగుండేశ్వరం.

స్థల పురాణంలోని ఒక కథనం

సాక్షాత్తూ బ్రహ్మదేవుడు లింగప్రతిష్ఠ చేసి అర్చించాడు. సృష్టి ఆరంభవేళ పరమేశ్వరుడు విష్ణువును సృష్టించాక అతని బొడ్డు నుంచి పుట్టిన కమలంలో బ్రహ్మదేవుడు వెలిశాడు. విష్ణువు, బ్రహ్మలు తాను గొప్పంటే తాను గొప్పని వాదులాడుతూ వారి మధ్య మహా అగ్నిలింగాన్ని దాని ఆది, తుది వెతుకులాటలో పడుతారు. బ్రహ్మ లింగాకరం తుది చూశానని అబద్ధమాడడంతో లింగాకృతిలోని పరమశివుడు కోపోద్రిక్తుడై అతని ఐదు శిరస్సులలో ఒక శిరస్సును ఖండిస్తాడు. ఆ శిరస్సు తెగిపడింది ఈ బ్రహ్మగుండం క్షేత్రంలోనే అన్నది కథనం. బ్రహ్మ తన పాపపరిహారార్థమై తన శిరస్సు పడిన క్షేత్రాన లింగ ప్రతిష్ఠ చేసి యజ్ఞకుండం ఏర్పాటు చేసుకుని ఆరాధిస్తాడు. నాటి నుంచి ఈ క్షేత్రానికి బ్రహ్మకుండం, తదుపరి బ్రహ్మగుండం, ఆపై బ్రహ్మగుండేశ్వరం అని పిలుస్తున్నారు.

18నుంచి శివరాత్రి ఉత్సవాలు

శివరాత్రి ఉత్సవాలలో భాగంగా బ్రహ్మగుండంలో ఈనెల 18న శనివారం జాగరణ, రాత్రి 12.15 గంటలకు శివపార్వతుల కళ్యాణం, నవమాంకముల నాటక ప్రదర్శన, దివంగత వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డి సంస్మరణార్థం అన్నదానం, 20న 4.55 గంటలకు రథోత్సవం, 21న వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి తెలిపారు.



బ్రహ్మగుండం క్షేత్రం



బ్రహ్మగుండేశ్వర స్వామి

చిరుధాన్యాల ఉత్పత్తులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న గుంటూరు విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ సంచాలకులు డా. బి. ముకుందరావు

ఎమ్మిగనూరురూరల్: చిరుధాన్యాల ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.ముకుందరావు, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎన్‌సీ.వెంకటేశ్వర్లు, జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.సరళమ్మలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ సుజాతమ్మ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేవీకేలు, ఏరువాక కేంద్రాలు చిరుధాన్యాల ఉత్పత్తులపై ప్రదర్శన క్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వాటి ఉత్పత్తులను పెంచేవిధంగా చూడాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్నామని, గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిరప, కంది పంటల్లో వచ్చే వైరస్, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ పద్ధతులను వివరించారు. నాబార్డు జిల్లా మేనేజర్ పార్థీవ, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు జె.సహదేవరెడ్డి, ప్రసన్న రాజేష్, ధనలక్ష్మీ, సతీష్, ప్రసాద్‌బాబు, శ్రావణి, శశిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, సుబ్రమణ్యాచారి, కేవీకే శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్, మహదేవయ్య, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన



చెరుకులపాడు రహదారిలో వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: హైవే-44 నుంచి చెరుకులపాడు క్రాస్ సమీప రహదారిలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బుధవారం పరిశీలించారు. పనుల వివరాలను డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, కాంట్రాక్టర్ దశరథ రామిరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తికావస్తున్న తరుణంలో త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి



కంబాలపాడు చెరువును పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి, తదితరులు

కృష్ణగిరి: ప్రభుత్వం రైతాంగానికి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జేడీఏ పి.వరలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలో చెరువును ఆమె బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరివర్తన పథకం కింద రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సాగునీటి వసతి కలిగిన గ్రామాల్లో ఈ పథకం కింద వ్యవసాయ పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రైతులు సంఘాలుగా ఏర్పడితే స్టార్ యూత్ అసోసియేషన్ అనే ఎన్జీఓ సంస్థ ద్వారా రైతులకు ఉపయోగపడే పరికరాలు అందిస్తామని తెలిపారు. అనంతరం రైతులకు ఈ పథకంపై ఆర్‌డీసీ ఏఓ నాగేశ్వరమ్మ, అల్లీపీరా శిక్షణ ఇచ్చారు. ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ రాజేష్, ఎస్‌జీఓ సిబ్బంది లక్ష్మి, అన్ని ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మగుండంలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

వెల్దుర్తి: బ్రహ్మగుండం క్షేత్రంలో ఈనెల 18 నుంచి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సీసీ కెమెరాలు మరిన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డిలకు సూచించారు. జాగరణ, కల్యాణం, రథోత్సవం, బండలాగుడు పోటీలకు హాజరయ్యే భక్తులు, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు, పార్కింగ్ వివరాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది మద్దిలేటి, నాయకులు రఘురెడ్డి, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స చేయించుకొని వస్తూ మృతి

ఆలూరు: మొలగవెల్లికి చెందిన గొల్ల బంగారి అపరాది (52) ఆరోగ్యం బాగాలేకపోవడంతో బుధవారం ఉదయం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాడు. ఆర్టీసీ బస్సులో ఆలూరుకు తిరిగి వస్తుండగా కరివేముల వద్ద మూత్ర విసర్జన కోసం బస్సు దిగి గుండెపోటుకు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. తెలిసిన వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. మృతుడికి భార్య సులోచనమ్మ, ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

రుణాల రికవరీపై దృష్టి పెట్టండి

ఆలూరు: సహకార పరపతి సంఘాలలో రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో తీసుకున్న రుణాలు రూ.60 కోట్లు రికవరీ చేయాలని స్థానిక కేడీసీసీ బ్యాంకు సిబ్బందిని సీఈఓ రామాంజనేయులు ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక కేడీసీసీ బ్రాంచ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ.. మార్చి 15 లోగా నిర్దేశిత రుసుము వసూలు చేసి రుణాలు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. రుణాల వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏజీఎం శ్రీనాథ్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం సైకిల్ యాత్ర

మద్దికెర: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన దివ్యాంగుడు నెయ్యల ప్రసాద్ ఇచ్చాపురం నుంచి అనంతపురం వరకు చేపట్టిన ట్రైసైకిల్ యాత్ర బుధవారం మద్దికెరకు చేరుకుంది. ప్రతి జిల్లా కలెక్టర్, మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి అధికారులతో మద్దతు పత్రాలు తీసుకుంటున్నారు. యాత్ర పూర్తయిన తర్వాత ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీకి పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. మద్దికెరలో ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఆర్ఐ రవికుమార్, తదితరులు సంఘీభావం తెలిపి మద్దతు పత్రాలు అందజేశారు.

తిమ్మగురుడు స్వామి ఉత్సవాలు

వెల్దుర్తి: చెర్లకొత్తూరు గ్రామంలో ఫక్కీరప్ప దేవస్థానంలో వెలసిన తిమ్మగురుడు స్వామి ఉత్సవాలు ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ఎల్లయ్య తాత తెలిపారు. ఉత్సవాలలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, పరుగు పందెం, గుండు ఎత్తు పందేలు, చెక్కభజన వృషభాల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 63052 95612, 9553047169 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

చిప్పగిరి: ఈ-క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ ఆనంద్ సూచించారు. ఇంకా 1,853 మంది రైతులు ఈ- కేవైసీ చేయించుకోవాల్సి ఉందని సమీప ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: కర్ణాటక మద్యాన్ని గుట్టుగా బైక్‌లపై ఆంధ్రాకు సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 3 బాక్సుల మద్యం, రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ బుధవారం తెలిపారు. హాలహర్వి మండలం మాచనూరుకు చెందిన నాగరాజు 2 బాక్సులు, ఎంకే పల్లి గ్రామానికి చెందిన పెద్దహనుమంతు ఒక బాక్స్ మద్యంను బైక్‌లపై తరలిస్తుండగా క్షేత్రగుడి చెక్‌పోస్టు వద్ద పట్టుబడినట్లు చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

వెల్దుర్తి: బ్రహ్మగుండం రోడ్డులో ఇటుకల బట్టీల టర్నింగ్ వద్ద కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో వెల్దుర్తిలోని రాణితోట యువకుడు దాసరి కిశోర్ గాయపడ్డాడు. బ్రహ్మగుండంలో శివరాత్రి ఉత్సవాలకు బొమ్మల అంగడి ఏర్పాటు చేసేందుకు కిశోర్ తన కుటుంబానికి సహకరించి తిరిగి వెల్దుర్తికి బైక్‌పై వస్తుండగా కారు ఢీకొట్టింది. కిశోర్ తీవ్రగాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

అన్నదమ్ములపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన భరత్, గౌతమ్

గోనెగండ్ల: మండలంలోని ఎర్రబాడు గ్రామంలో మల్లికార్జున రెడ్డి కుమారులు భరత్, గౌతమ్ బుధవారం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. పిల్లలు బిగ్గరగా అరవడంతో గ్రామస్తులు కుక్కలను తరిమికొట్టారు. దీంతో చిన్నారులు ప్రాణాలతో బయటపడ్డారు. గాయపడిన చిన్నారులను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉత్సవాలకు వేళాయె



తిమ్మగురుడు స్వామి



పక్కీరప్ప స్వామి

తుగ్గలి: భక్తుల కొంగుబంగారంగా ప్రసిద్ధిగాంచింది బోడబండ పుణ్యక్షేత్రం. మండల పరిధిలోని మీటే తండ సమీపంలోని బోడబండ కొండలో వెలసిన తిమ్మగురుడు, పక్కీరప్ప స్వాముల ఆలయం 150 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రతి సోమవారం చుట్టుపక్కల గ్రామాల భక్తులతో పాటు, వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రంతా భజనలు చేస్తారు. ఈ ఆలయాల్లో నిద్ర చేసినా, కొండపై ఉన్న దొన నీటిని తాగినా కోరిన కోర్కెలు, దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని భక్తుల విశ్వాసం. ఏటా మహా శివరాత్రి రోజు నుంచి రెండు రోజుల పాటు తిరునాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. తిమ్మగురుడు, పక్కీరప్ప స్వాముల వేర్వేరు రథోత్సవాలు నిర్వహిస్తారు. తిరునాల ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఆలయానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేకున్నా భక్తుల విరాళాలతో ఆలయ నిర్వాహకులు ఎంతో అభివృద్ధి చేస్తున్నారు.

18 నుంచి తిరునాల: ఈనెల 18 నుంచి బోడబండ పుణ్యక్షేత్రంలో తిరునాల ఉత్సవాలు నిర్వహించనున్నారు. 18న ప్రత్యేక పూజలు, జాగరణ, 19న సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్తలు కనికిరెడ్డి సుదర్శనరెడ్డి, అప్పా వేణు, పూజార్లు కృష్ణయ్యఆచారి, పక్కీరప్ప, భీమన్న తిరునాల ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. తిరునాల పురస్కరించుకొని 19న రాత్రి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వైభవంగా బండేగురువుల ప్రభోత్సవం



అశేష భక్తజనవాహిని మధ్య ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నందవరం: మండలంలోని పూలచింత గ్రామంలో వెలసిన సద్గురు శ్రీ వరబండేగురుస్వాముల జాతర మహోత్సావాలలో భాగంగా మఠం పీఠాధిపతి శంకరప్ప స్వామి, ఉప పీఠాధిపతి బండేగురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అశేష జనవాహిని మధ్య ప్రభోత్సవం అత్యంత రమణీంగా సాగింది. బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలు, పుష్పాలతో విశేషాలంకరణ గావించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం సద్గురువుకు పల్లకి సేవ, నందికోలు సేవ, శ్రీవారి మూలస్థానానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. పీఠాధిపతి శంకరప్ప స్వామికి కర్ణాటక భక్తులు నాణేలతో తులాభారం చేపట్టారు. సాయంత్రం పల్లకి సేవలో స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపుగా తీకెళ్లారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామి వారి రథచక్రాలు ముందుకు సాగాయి. డోలు, సన్నాయిలు, బ్యాండు మేళాలు మధ్య ప్రభోత్సవం వైభవంగా సాగింది. స్వామి మఠం నుంచి రథాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి యథాస్థానానికి చేర్చారు. సర్పంచ్ అక్కమహాదేవి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.